# సాక్షి నిజామాబాద్

శనివారం : 29 : ఏప్రిల్ : 2023






## వీసీని బర్తరఫ్ చేయాలి

అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న తెయూ వీసీని బర్తరఫ్ చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి.

- IIలో ▸



## అవినీతి ఎమ్మెల్యేలపై చర్యలేవి..?

దళితబంధులో అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలపై సీఎం చర్యలు తీసుకోవాలని డీసీసీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం

35.2 /21.9

## వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం నుంచి చిరు జల్లులు కురియవచ్చు. సాయంత్రం ఈదురు గాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### భూముల క్రమబద్ధీకరణకు ఏప్రిల్ 30తో గడువు ముగింపు

**సుభాష్‌నగర్ :** జీవో నం. 58, 59 ద్వారా అభ్యంతరం లేని ఆక్రమిత ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు ఈనెల 30వ తేదీతో గడువు ముగియనుందని అదనపు కలెక్టర్ బి చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు నిర్ణీత గడువులోగా మీ సేవ ద్వారా దరఖాస్తులను సమర్పించాలని ఆయన సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 58, 59 ప్రకారం అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు 2014 జూన్ 02 కటాఫ్ తేదీ ఉండగా, దానిని 2020 జూన్ 02కు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గత నెల మార్చి 17వ తేదీన ఉత్తర్వుల సంఖ్య 29ను జారీ చేసిందని పేర్కొన్నారు. నూతనంగా భూ క్రమబద్ధీకరణకు దరఖాస్తులు చేసుకునేందుకు ఏప్రిల్ 1 నుంచి 30వ తేదీ వరకూ అవకాశం కల్పించిందని, మీ సేవ ద్వారా గడువులోపు దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

### నాణ్యతా ప్రమాణాలు పాటించాలి..



**బాల్కొండ :** శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద చేపడుతున్న మరమ్మతు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్ట్ చీఫ్ ఇంజినీర్ రమేశ్ అన్నారు. శుక్రవారం శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద చేపడుతున్న వరద గేట్ల మరమ్మతు పనులను, ఫ్లడ్ కంట్రోల్ రూం నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల్లో ఆలస్యంపై అసహనం వ్యక్తం చేశారు. త్వరలోనే వరదగేట్ల ఆపరేటింగ్ విధానం రిమోట్ కంట్రోల్‌తో చేపట్టేలా ప్రణాళిక చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కాలువల, ప్రాజెక్ట్ మరమ్మతు పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. చేపట్టాల్సిన పనులకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఆయన వెంట ఎస్ఈ కాశీ విశ్వనాథ్, ఈఈ ఏఆర్ ఎన్ శర్మ, డీఈఈ మాధవి, ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్, ఈఈ చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

### 3 నుంచి జిల్లా కోర్టుకు సెలవులు

**ఖలీల్‌వాడి :** మే 3 నుంచి 31 వరకు జిల్లా కోర్టులకు సెలవులు ప్రకటిస్తూ హైకోర్టు నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సెలవుల సమయంలో అత్యవసర కేసుల విచారణకు రెండు విడతల్లో కోర్టులు అందుబాటులో ఉండనున్నాయి. తొలి విడతలో మే 1 నుంచి 16 వరకు నిజామాబాద్ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఉంటారని, రెండో విడతలో 3వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి 17 నుంచి 31 అందుబాటులో ఉంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### తెయూ అకౌంట్స్ విభాగంలో ఇద్దరు బదిలీ

**తెయూ(డిచ్‌పల్లి) :** తెలంగాణ యూనివర్సిటీ అకౌంట్ సెక్షన్‌లో జూనియర్ అసిస్టెంట్లు మధులిక, నవీన్‌రాజ్‌ను ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్‌కు శుక్రవారం బదిలీ చేసినట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం యాదగిరి తెలిపారు. వీరిపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరుపుతామన్నారు. వీరి స్థానంలో జూనియర్ అసిస్టెంట్లు కిషోర్, దిలీప్‌ను అకౌంట్ సెక్షన్‌కు బదిలీ చేసినట్లు రిజిస్ట్రార్ తెలిపారు.

### ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రోత్సాహం



**నిజామాబాద్‌నాగారం :** ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రకాలుగా ప్రోత్సాహం అందిస్తున్నాయని డీఆర్‌డీవో చందర్‌నాయక్ తెలిపారు. శుక్రవారం జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో పీఎం సూక్ష్మ ఆహార ఉత్పత్తి పథకం – తయారీ సంస్థలు క్రమబద్ధీకరణ కింద రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ఫుడ్ ప్రాసెసింగ్ మిషనరీ ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల నుంచి సబ్సిడీతో కూడిన రుణ సదుపాయం పొందేందుకు కనీస అర్హతలు, విధివిధానాల గురించి తెలియజేశారు. జిల్లాలో పసుపు ఆధారిత యూనిట్లను నెలకొల్పేందుకు ఔత్సాహికులు ముందుకు రావాలన్నారు. అర్హులకు 35% సబ్సిడీతో కూడిన రుణాన్ని ఇస్తుందన్నారు. జిల్లా పరిశ్రమల మేనేజర్ సమ్మయ్య, మెప్మా పీడీ రాములు, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి తిరుమల ప్రసాద్, నాబార్డు డీజీఎం నాగేష్, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

# అతివేగం.. ప్రాణ హననం

- జిల్లాలో ఆందోళన కలిగిస్తున్న వరుస ప్రమాదాలు
- జాతీయ రహదారి, ఇంటర్నల్ రోడ్లు, మూల మలుపుల వద్ద ఘటనలు
- ఒక్కోసారి నలుగురి నుంచి ఐదుగురి వరకు మృత్యువాత
- పెద్దదిక్కులను కోల్పోయి రోడ్డున పడుతున్న కుటుంబాలు

**ఖలీల్‌వాడి :** మొన్న జిల్లా కేంద్రంలోని అర్సపల్లి బైపాస్ రోడ్డుపై బొలెరో, ప్యాసింజర్ ఆటోను ఢీకొట్టడంతో నలుగురు మృతి చెందారు. క్షతగాత్రుల్లో ఒకరి ఎడమ చేతిని తొలగించారు. మరో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. నిన్న మాక్లూర్ మండల కేంద్రం వద్ద బొలెరో, ప్యాసింజర్ ఆటోను ఢీకొట్టడంతో నలుగురి పరిస్థితి విషమంగా మారింది. మరో నలుగురికి తీవ్రగాయాలు అయ్యాయి. ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. ఈ రెండు ప్రమాదాల్లో బొలెరో వాహనాల అతివేగం, డ్రైవర్ల నిర్లక్ష్యమే కారణం.. ఇలా జిల్లాలో జరుగుతున్న దారుణ ఘటనలలో మానవ తప్పిదాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. జిల్లాలోని జాతీయ రహదారులతో పాటు ఇంటర్నల్ రోడ్లు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. జాతీయ రహదారులపై ప్రస్తుతం బ్లాక్ స్పాట్లు, మూలమలుపులు లేవు. అయినా తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

**130 కిలో మీటర్ల స్పీడ్ ..**

నిబంధనల ప్రకారం జాతీయ రహదారిపై అన్ని రకాల వాహనాలు 80 కిలోమీటర్ల వేగం దాటకుండా వెళ్లాలి. అయితే 120 నుంచి 130 కిలోమీటర్ల వేగంతో వాహనాలను నడిపిస్తున్నారు. దీంతో ప్రమాదాలు ఎక్కువగా జరగడానికి ప్రధాన కారణం అవుతోంది.

**కొన్ని చోట్లే స్పీడ్ గన్‌లు..**

జాతీయ రహదారిపై కొన్ని ప్రాంతాల్లో మాత్రమే స్పీడ్ లేజర్ గన్‌లను ఏర్పాటు చేశారు. ప్రమాదకర డ్రైవింగ్ కారణంగా ప్రతిరోజు 200 పైగా ఈ చలాన్‌లను జారీ చేస్తున్నట్లు తెలుస్తోంది. అక్కడక్కడ మాత్రమే తనిఖీలు నిర్వహించడంతో ఎక్కువగా ప్రయాణాలు చేసేవారు ఈ స్పీడ్‌గన్‌లు ఉన్న చోట వేగాన్ని అదుపు చేస్తున్నారు. లేని చోట్ల స్పీడ్ పెంచి వాహనాలను రయ్ మనిపిస్తున్నారు.

**హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో..**

జాతీయ రహదారిపై మూలమలుపుల వద్ద అధికంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నిర్మల్‌కు వెళ్లే జాతీయ రహదారిలో చేపూర్ వద్ద, మామిడిపల్లి సమీపంలో రెండు కూడళ్ల వద్ద, ఆర్మూర్ నుంచి జగిత్యాల వెళ్లే రోడ్డులో చేపూర్ వద్ద, సదాశివనగర్ వద్ద ప్రమాదాలు నెలకొంటున్నాయి. ఆర్మూర్ నుంచి నిజామాబాద్ దారిలో చిన్నాపూర్ గండి వద్ద అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మలుపుల వద్ద కొన్ని చోట్ల నేషనల్ హైవే ఆథారిటీ బోర్డులు ఏర్పాటు చేసింది. కొన్ని చోట్ల విస్మరించడంతో ప్రమాదాలకు ఆస్కారమవుతోంది.

**30వేల వాహనాల రాకపోకలు..**

కామారెడ్డి జిల్లాలోని భిక్కనూర్ నుంచి నిజామాబాద్‌లోని బాల్కొండ పరిధిలోని బుస్సాపూర్ శివారు వరకు 100 కిలోమీటర్ల పైబడి 44వ నంబరు జాతీయ రహదారి ఉంది. కాశ్మీర్, కన్యాకుమారి ప్రధాన మార్గం కావడంతో నిత్యం భారీ వాహనాలు, ట్రక్కుల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. హైదరాబాద్– నాగ్‌పూర్– నిజామాబాద్ మార్గంలో రోజుకు సుమారు 30 వేల వాహనాలు రాకపోకలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది.



మాక్లూర్ వద్ద ప్రమాదానికి గురైన బొలెరో, ఆటో





## ఆటోను ఢీకొట్టిన బొలెరో

- నలుగురి పరిస్థితి విషమం
- మరో నలుగురికి తీవ్రగాయాలు

**మాక్లూర్ :** మాక్లూర్ మండల కేంద్రంలోని రఫత్ ఖాన్ గార్డెన్ సమీపంలో నందిపేట రహదారి పై శుక్రవారం బొలెరో వాహనం, ప్యాసింజర్ ఆటోను ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న 10 మందికి గాయాలయ్యాయి. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉండగా, మరో నలుగురి కాళ్లు చేతులు విరిగిపోయి తీవ్రంగా గాయపడ్డారు. మరో ఇద్దరు స్వల్పగాయాలతో బయట పడ్డారు. నందిపేట్ వైపు నుంచి వస్తున్న ఆటోను నిజామాబాద్ నుంచి ఎదురుగా వెళ్తున్న బొలెరో వేగంగా ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలోని ప్రయాణికులు చెల్లా చెదురుగా ఎగిరి పడ్డారు. గాయాలతో రక్తసిక్తమయ్యారు.

డొంకేశ్వర్‌కు చెందిన ఆటో డ్రైవర్ మైమూద్, సాజిదాబేగం కుడి చేతులు విరిగిపోగా, నందిపేటకు చెందిన కుమ్మరి రజిని ఎడమకాలు, మాదాపూర్‌కు చెందిన పి లక్ష్మి కుడికాలు విరిగిపోయాయి. డొంకేశ్వర్‌కు చెందిన యాసిన్‌బేగం ఆమె కుమారుడు రిజ్వాన్, జ్యోతినగర్‌కు చెందిన చీటూరి మీనా, మామిడ్ల శోభల తలలకు బలమైన గాయాలు అయ్యాయి. వీరి పరిస్థితి విషమంగా ఉంది. నందిపేటకు చెందిన అంజి, మాదాపూర్‌కు చెందిన భరత్‌రావుకు స్వల్ప గాయాలయ్యాయి. బొలెరో వాహన డ్రైవర్ భగత్ నిర్లక్ష్య డ్రైవింగ్ వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు ఎస్సై యదగిరిగౌడ్ తెలిపారు. భగత్‌కు కూడా తీవ్రగాయాలు అయ్యాయి. ప్రమాదంలో ఆటో ధ్వంసం అయింది. బొలెరో వాహనం బోల్తాపడింది. క్షతగాత్రులందరినీ పోలీసులు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



గాయపడిన యాసిన్ బేగం, పిట్ల లక్ష్మి

## ఊరంతా విషాదం

**ఖలీల్‌వాడి/బోధన్ రూరల్ :** నిజామాబాద్ నగరంలోని అర్సపల్లి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బోధన్ మండలం ఊట్‌పల్లి గ్రామానికి చెందిన నలుగురు మృతి చెందడంతో శుక్రవారం అంత్యక్రియల సందర్భంగా గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ఐటీ హబ్‌లో కూలీ పనులు ముగించుకుని వెళ్తున్న వీరి ఆటోను బొలెరో వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో తండ్రీ కొడుకులు దియావత్ శ్యామ్, యశ్వంత్, మరో ఇద్దరు రత్నావత్ ప్రశాంత్, రుదావత్ రేఖ మృతి చెందారు. వీరి అంత్యక్రియలకు ఊరంతా తరలి వచ్చి కన్నీరు పెట్టారు.

**భార్య మరణం తెలియని కృష్ణ ..**

రూదవాత్ రేఖ ప్రమాదంలో మృతి చెందిన విషయం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె భర్త కృష్ణకు తెలియదు. ఆయన తలకు తీవ్ర గాయం కాగా వైద్యులు సర్జరీ చేశారు. నాలుగు, రెండేళ్ల వయసున్న వారి కుమారుల రోదనలు గ్రామస్తులను కలచి వేశాయి.

**చేయి కోల్పోయి..**

మరోవ్యక్తి రతావత్ కృష్ణకు ఎడమ చెయ్యి తెగిపోయింది. తెగిన చెయ్యితో పాటు క్షతగాత్రున్ని జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు చెయ్యి అమరిక వీలు కాదని చెప్పారు. రక్తస్రావం అధికం కావడంతో ఆపరేషన్ చేశారు.



ఊట్ పల్లిలో మృతుల అంత్యక్రియల అనంతరం విషాదంలో ఓ కుటుంబం

## ప్రమాదాలు ఇలా..

- ఏప్రిల్ 15న మెండోరా మండలం బుస్సాపూర్‌లో ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొనడంతో 25 మంది గాయపడ్డారు. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి.
- అక్టోబర్ 17న మాక్లూర్ మండలం చిన్నాపూర్ గండి వద్ద ఆపిన ఆర్టీసీ బస్సును, మరో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో 12 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ఒకరి చేయి విరిగిపోయింది.
- డిసెంబర్ 10న ఆర్మూర్ మండలం చేపూర్ వద్ద లారీని ఓవర్ టేక్ చేస్తూ కారు ఢీకొనడంతో నందిపేట్ మండలానికి చెందిన నలుగురు యువకులు మృతి చెందారు. యువకులు కొండగట్టు దర్శనానికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది.
- డిసెంబర్ 17న జక్రాన్‌పల్లి వద్ద 44 వ జాతీయ రహదారిపై ఆటోను వెనుక నుంచి కారు ఢీకొనడంతో ఏడుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఇద్దరు మృతి చెందారు.

## రామాయం పేట వద్ద ప్రమాదంలో వ్యాపారి మృతి

- భార్య, మనవడికి గాయాలు





డీసీఎంను ఢీకొన్న కారు, నర్సింగ్‌షా (ఫైల్)

**ఖలీల్‌వాడి / రామాయంపేట (మెదక్):** మెదక్ జిల్లా రామాయంపేట శివారులో జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో నిజామాబాద్‌కు చెందిన వ్యాపారి శికారి నర్సింగ్‌షా మృతి చెందాడు. ఆయన నగరంలోని కుమార్ గల్లీలో ఫ్యాన్సీ బ్యాంగిల్ స్టోర్ నిర్వహిస్తున్నారు. అతని భార్య బాలమణి, మనవడు విశాల్ కారులో హైదరాబాద్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. డ్రైవర్ గోపి అతి వేగం, అజాగ్రత్తగా కారు నడుపుతూ వెనుక నుంచి డీసీఎంను ఢీకొట్టాడు. నర్సింగ్‌షా ముందుసీటులో కూర్చుండగా, వెనుక సీటులో కూర్చున్న అతని భార్య, మనవడికి తీవ్రగాయాలయ్యాయి. బాధితులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## చదరంగంతో చురుకుదనం



చదరంగం పోటీలో అర్షితకు ప్రథమ బహుమతి అందజేస్తున్న డీఈవో దుర్గాప్రసాద్, కాకతీయ ఒలంపియాడ్ స్కూల్ డైరెక్టర్ రామోజీరావు తదితరులు

చదరంగం ఆడడం వల్ల విద్యార్థుల్లో చురుకుదనం పెరుగుతుందని, మెదడు వేగంగా పని చేస్తుందని డీఈవో దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. నగరంలోని కాకతీయ ఒలంపియాడ్ స్కూల్‌లో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన చెస్ పోటీల ముగింపు కార్యక్రమానికి డీఈవో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులను ఉత్తేజపర్చేందుకు 'సాక్షి' ఆధ్వర్యంలో వేసవిలో శిక్షణ శిబిరాల నిర్వహణ అభినందనీయమన్నారు. చెస్‌తో ఒత్తిడి తగ్గి మెదడు చురుగ్గా పనిచేస్తుందని కాకతీయ ఒలంపియాడ్ స్కూల్ డైరెక్టర్ సీహెచ్ రామోజీరావు అన్నారు. – నిజామాబాద్ నాగారం

- వివరాలు 8లో..

## ప్రత్యేక శ్రద్ధతో నగరాభివృద్ధి

### మేయర్ నీతూకిరణ్

- జిల్లాకు నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ల రాక
- నగరంలో అభివృద్ధి పనుల పరిశీలనకు వచ్చిన బృందాలు



కలెక్టరేట్ వద్ద అభివృద్ధి పనులను వివరిస్తున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నరేందర్ తదితరులు



నిర్మల్ జిల్లా మున్సిపల్ కమిషనర్లతో మాట్లాడుతున్న నగర మేయర్ దండు నీతూకిరణ్

**నిజామాబాద్ నాగారం :** నగరంలో ప్రత్యేక శ్రద్ధతో ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని నగర మేయర్ నీతూ కిరణ్ పేర్కొన్నారు. నగర పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల పరిశీలన కోసం విచ్చేసిన నిర్మల్ జిల్లా పరిధిలోని మున్సిపల్ కమిషనర్లు శుక్రవారం నగర మేయర్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం బృందానికి మున్సిపల్ అధికారులు నగరంలోని 39వ డివిజన్‌లో ఉన్న పార్కును చూపించారు. ఖానాపూర్ శివారులో ఉన్న భూగర్భ మురుగునీటి శుద్ధి కర్మాగారాన్ని, ఖిల్లా ఫిల్టర్ బెడ్, నీటి సరఫరా తీరును పరిశీలించారు. అహ్మదీబజార్, ఖలీల్‌వాడిలో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ యార్డ్, పనులను పరిశీలించారు. మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధి పనులను, నగరంలో రోడ్లు, సెంట్రల్ లైటింగ్‌ను పరిశీలించారు. సమీకృత కలెక్టర్ ఆఫీస్ పరిసర ప్రాంతాల నిర్వహణ, వైకుంఠదామలు, నర్సరీల నిర్వహణ, డంపింగ్ యార్డ్‌లను చూశారు. కుక్కల బెడద నివారణకు చేపట్టిన యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని పరిశీలించారు. మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నరేందర్, ఇంజినీరింగ్, శానిటేషన్ సిబ్బంది బృందానికి వివరించారు. నిర్మల్ భైంసా మున్సిపల కమిషనర్ వెంకటేశ్వర్‌రావు, ఖానాపూర్ కమిషనర్ రత్నాకర్, నిర్మల్ మున్సిపల్ కమిషనర్ రాజు బృందం పనులను పరిశీలించింది.

# తడిసిన ధాన్యం కొనాల్సిందే..

పురుగు మందు డబ్బాలతో రైతుల నిరసన

**నిజామాబాద్ సిటీ :** అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నిజామాబాద్ రూరల్ మండలం తిర్మన్‌పల్లి, కొండూర్ గ్రామల రైతులు పురుగుల మందు డబ్బాలతో కొండూర్ చౌరస్తా వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అధికారులు అక్కడికి చేరుకుని రైస్‌మిల్లర్లతో మాట్లాడి సమస్యను పరిష్కరించటంతో రైతులు నిరసన విరమించుకున్నారు. మండలంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై ఆరబెట్టిన వరి తడిసిపోగా రైస్ మిల్లర్లు ఆ ధాన్యాన్ని కొనట్లేదు. దీంతో గ్రామస్తులు శుక్రవారం రోడ్డుపై పురుగుల మందు డబ్బాతో బైఠాయించారు. గంటపాటు రోడ్డుపై బైఠాయించటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న వ్యవసాయ అధికారులు హీరా జాదవ్, ఏఈవో జ్ఞానేశ్వర్, ఆర్ఐ హరీష్‌రెడ్డి, రూరల్ పోలీసులు అక్కడకు చేరుకున్నారు. రైతులు మాట్లాడుతూ తిర్మన్‌పల్లి చుట్టు పక్కల ఉన్న రైస్‌మిల్లర్లకు యూపీ, బీహార్, కోల్‌కతా నుంచి వస్తున్న ధాన్యాన్ని కొంటున్న మిల్లర్లు స్థానికంగా తడిసిన ధాన్యాన్ని కొనట్లేదని వాపోయారు. డీసీవో సింహచలంకు రైతుల సమస్య తెలుపటంతో ఆయన మిల్లర్లతో మాట్లాడి తడిసిన ధాన్యాన్ని కొనాలని ఆదేశించారు. వ్యవసాయశాఖ అధికారులు, ఆర్ఐ, పాల్దా సొసైటీ వైస్ చైర్మన్ కొల శ్రీనివాస్ పలు రైస్‌మిల్లర్లకు వెళ్లి తడిసిన ధాన్యాన్ని కొనాల్సిందేనని ఆదేశించారు. మిల్లర్ల నుంచి స్పష్టమైన హామీ వచ్చాక రైతులు నిరసన విరమించారు. ఈ నిరసన కార్యక్రమంలో తిర్మన్‌పల్లి, ఆకుల కొండూర్ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న రైతులు

## కల్లాల వద్దే కావలి కాస్తూ..

ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మరో నాలుగైదు రోజుల పాటు వర్షాలు ఉండడంతో ఎండబోసిన ధాన్యం ఎక్కడ తడుస్తుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం వస్తే వెంటనే టార్పాలిన్లు కప్పడానికి పగలు, రాత్రి తేడా లేకుండా కల్లాల వద్దే కావలి కాస్తున్నారు. కుప్పలపైనే కునుకు తీస్తున్నారు. – డొంకేశ్వర్(ఆర్మూర్)



తొండాకూర్‌లో వడ్ల కుప్పపైనే కునుకు తీస్తున్న రైతు

## క్లుప్తంగా

### 30న బీసీ గురుకుల ఇంటర్, డిగ్రీ ప్రవేశ పరీక్ష

**నిజామాబాద్‌అర్బన్:** బీసీ గురుకులాల్లో ఇంటర్, డిగ్రీ ప్రవేశాలకు ఈ నెల 30న పరీక్ష నిర్వహిస్తున్నట్లు బీసీ గురుకులాల కో–ఆర్డినేటర్ సత్యనాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా డిగ్రీ పరీక్షకు 527 మంది, ఇంటర్ కోసం 2,088 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. పరీక్ష కోసం ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జిల్లాలో మొత్తం 15 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### 10 నుంచి ఉచిత శిక్షణ

**డిచ్‌పల్లి:** డిచ్‌పల్లి మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ) ఆధ్వర్యంలో పురుషులకు వచ్చే నెల 10 నుంచి పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు డైరెక్టర్ ఎస్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సీసీ టీవీ (13రోజులు), ఎలక్ట్రీషియన్ (హౌస్‌వైరింగ్), ఏసీ రిపేరింగ్, ఫొటోగ్రఫీ– వీడియోగ్రఫీ (30 రోజులు) కోర్సుల్లో శిక్షణ ఉంటుందన్నారు. అభ్యర్థులకు ఉచిత శిక్షణ, భోజన సదుపాయం, హాస్టల్ వసతి ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రం అందిస్తామని తెలిపారు. 19 నుంచి 35 ఏళ్లలోపు ఉండి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన గ్రామీణ నిరుద్యోగ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ వెంట ఆధార్‌కార్డు, రేషన్ కార్డ్, ఎస్సెస్సీ ధ్రువీకరణ పత్రం, ఐదు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకుని వచ్చి సంస్థ కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 08461–222428, 08461–295428 నంబర్లను సంప్రదించాలన్నారు.

### శిక్షణకు హాజరు కావాలి

**నిజామాబాద్‌అర్బన్:** టైలరింగ్, డ్రాయింగ్, మ్యూజిక్ టీచర్ సర్టిఫికెట్ వేసవి శిక్షణ తరగతులకు ఆసక్తి గల వారు హాజరు కావాలని డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మే 1 నుంచి జూన్ 11 వరకు కోటగల్లీలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శిక్షణ ఉంటుందని వివరించారు.

### జాతీయ సెమినార్‌లో డీసీసీబీ చైర్మన్



**బాన్సువాడ:** చెన్నైలో జరిగిన ఎన్‌ఏఎఫ్‌ఎస్‌సీవోబీ(నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ స్టేట్ కో ఆపరేటీవ్ బ్యాంక్స్ లిమిటెడ్) జాతీయ సెమినార్‌కు ఉమ్మడి జిల్లాల డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి హాజరయ్యారు. టీఎస్‌సీఏబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అధ్యక్షతన తమిళనాడు రాష్ట్ర సహకార శాఖ మంత్రి తిరుకేఆర్ పెరియ కరుప్పన్ ముఖ్యఅతిథిగా హాజరైన సెమినార్‌కు తెలంగాణ డీసీసీబీ చైర్మన్లతో కలిసి భాస్కర్‌రెడ్డి హాజరయ్యారు. సెమినార్‌లో సహకార బ్యాంకుల రైతులకు అవసరమయ్యే రుణాల గురించి అవగాహన కల్పించినట్లు తెలిసింది.

# చదరంగంతో చురుకుదనం

- డీఈవో దుర్గాప్రసాద్
- 'సాక్షి' వేసవి క్రీడల శిబిరానికి విశేష స్పందన
- అట్టహాసంగా ముగిసిన చదరంగం పోటీలు





సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో చదరంగం ఆడుతున్న విద్యార్థులు





మాట్లాడుతున్న డీఈవో దుర్గాప్రసాద్, కాకతీయ ఒలంపియాడ్ స్కూల్ డైరెక్టర్ రామోజీరావు

**నిజామాబాద్‌నాగారం:** చదరంగం ఆడటం ద్వారా మెదడు చురుగ్గా పని చేస్తుందని డీఈవో దుర్గాప్రసాద్ అన్నారు. నగరంలోని కాకతీయ ఒలంపియాడ్ స్కూల్‌లో సాక్షి మీడియా గ్రూపు ఆధ్వర్యంలో వేసవి శిబిరంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన చదరంగం పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఈఓ మాట్లాడుతూ.. ఏడాది పాటు విద్యార్థులు చదువులో బిజీగా ఉంటారని, వేసవిలో విద్యార్థులను ఉత్తేజ పర్చడానికి శిక్షణ శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. చెస్‌లో అంతర్జాతీయస్థాయిలో దేశం నుంచి ఎంతో మంది క్రీడాకారులు ఉన్నతంగా ఎదిగిన విషయాన్ని గుర్తు చేశారు. చెస్ ఆటలో మెదడుకు పని ఉంటుందని, ఎత్తుకు పైఎత్తులు ఉంటాయన్నారు. చెక్ పెట్టడానికి ఎన్నో ఎత్తుగడులు వేస్తామని, అలాగే మన జీవితంలో ఎదురైనా సమస్యలను, సవాళ్లను ఎదుర్కోవడానికి చెస్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

**ఒత్తిడి తగ్గుతుంది**

చెస్ ఆట మెదడును ఉత్తేజ పరుస్తుందని కాకతీయ ఒలంపియాడ్ స్కూల్ డైరెక్టర్ సీహెచ్ రామోజీరావు అన్నారు. చెస్‌ను ప్రతినిత్యం సాధన చేయాలన్నారు. ఒత్తిడి తట్టుకోవడానికి చదరంగం సాధన ఉపయోగపడుతుందని చెప్పారు. ఇతర క్రీడలు ఆడినా సరే చెస్‌ను సాధన చేయాలని సూచించారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి సాక్షి యాజమాన్యం పోటీలు నిర్వహించినందుకు ధన్యవాదాలు తెలిపారు. చెస్ సాధనతో పాటు పోటీల్లో పాల్గొంటేనే విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ బయటకు వస్తుందని చెస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ అన్నారు. చెస్ ఆడటం ద్వారా నాలెడ్జ్ పెరుగుతుందని చెస్ ఆర్బిటరి వేణు మాధవ్ అన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నటరాజ్, కళాశాల ఇన్‌చార్జి శ్రీలత, సాక్షి బ్రాంచ్ మేనేజర్ మహేష్, బ్యూరో ఇన్‌చార్జి భద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో డీఈవో దుర్గాప్రసాద్, కాకతీయ ఒలంపియాడ్ స్కూల్ డైరెక్టర్ రామోజీరావు తదితరులు

### రాష్ట్రస్థాయిలో రాణించా..



చెస్‌లో ఇప్పటికే రెండుసార్లు రాష్ట్రస్థాయికి వెళ్లి మెడల్స్ సాధించాను. చెస్‌తో నాకు మైండ్ రిలీఫ్ ఉంటుంది. అందుకే ఎలాంటి ఒత్తిడినైనా తట్టుకోగలుగుతాను. ఇంట్లో చెస్‌ను సాధన చేస్తుంటాను.

– జి అన్షిత, విన్నర్, అభ్యాస స్కూల్,

### 'సాక్షి'కి ధన్యవాదాలు



చెస్ పోటీలు నిర్వహించినందుకు సాక్షి యాజమాన్యానికి ధన్యవాదాలు. ఈ పోటీల్లో పాల్గొని, బహుమతి సాధించడం చాలా సంతోషంగా ఉంది. చెస్ నిత్యం సాధన చేయడంతో నాకు ఆలోచన శక్తి పెరుగుతుంది.

– మధుశ్రీ, రన్నర్, అభ్యాస స్కూల్

### మొదటి సారే విజేతగా..



నేను చెస్ పోటీల్లో మొదటిసారిగా పాల్గొన్నాను. మొదటిసారే విజేతగా నిలవడం చాలా సంతోషంగా ఉంది. నాలుగు రౌండ్‌లలో గెలిచి, నాలుగు పాయింట్లు సాధించాను. ఇంటివద్ద నిత్యం చదరంగం సాధన చేస్తాను.

– వి చేతన్‌కుమార్, విన్నర్, విజయ్ హైస్కూల్

### చెస్‌తో ఉత్సాహం



చెస్ నాలో ఉత్తేజాన్ని, ఉత్సాహాన్నిస్తుంది. అందుకే ప్రతినిత్యం చెస్ సాధన చేస్తుంటాను. చెస్ పోటీలు ఎక్కడున్నా పాల్గొంటాను. మా పాఠశాలలో, రాష్ట్రస్థాయిలో రాణించాను.

– సృజన్‌కుమార్, రన్నర్, అభ్యాస స్కూల్

## తెయూ వీసీని బర్తరఫ్ చేయాలి



వీసీ రవీందర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీవీఎం, ఎంఎస్‌ఎఫ్ నాయకులు

**తెయూ(డిచ్‌పల్లి):** అవినీతి, అక్రమాలకు పాల్పడ్డ తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ రవీందర్‌ను ప్రభుత్వం వెంటనే బర్తరఫ్ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. భారతీయ విద్యార్థి మోర్చా(బీవీఎం), మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం పరిపాలనా భవనం ఎదుట వీసీ దిష్టిబొమ్మను దహనం చేశారు. విద్యార్థి నాయకులు మాట్లాడుతూ.. వీసీ ఇష్టానుసారంగా అవినీతికి అక్రమాలకు పాల్పడుతూ కోట్ల రూపాయల దండుకున్నారని, ఎవరు ఎక్కువ డబ్బులు ఇస్తే వారికే పదవులు కట్టబెట్టారన్నారని ఆరోపించారు. ఈసీ అనుమతి లేకుండా అక్రమ నియామకాలు చేపట్టారని తెలిపారు. వర్సిటీలో పని చేస్తున్న మహిళలను ప్రలోభాలకు గురి చేస్తూ మానసికంగా బెదిరింపులకు గురి చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు రమణ, సూరజ్, రవి, సురేష్, వెంకట్రాములు, నరేష్ పాల్గొన్నారు.

**ఏసీబీతో విచారణ జరిపించాలి**

తెయూ వీసీ రవీందర్ అవినీతి, అక్రమాలపై ఏసీబీతో విచారణ జరిపించాలని ఆయనను వెంటనే బర్తరఫ్ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. శుక్రవారం తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వీసీతో పాటు వర్సిటీ అక్రమాల్లో పాలు పంచుకున్న ప్రతి ఒక్కరిపై చర్య తీసుకోవాలన్నారు. తెయూ పీడీఎస్‌యూ అధ్యక్షుడు సంతోష్, నాయకులు దేవిక, అక్షయ్, అశ్విత్, మణికంఠ, శివసాయి, రాకేష్ పాల్గొన్నారు.

### జియో ఇన్ఫర్మాటిక్స్ యూజర్స్ మీట్‌కు ఎంపిక



అజేందర్ కుమార్

**భిక్కనూరు:** తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ పూర్వ విద్యార్థి మామిళ్ల అజేందర్ కుమార్, అమెరికాలోని శాండ్ డియాగోలో వచ్చే నెలలో జరిగే ప్రపంచ జియోఇన్ఫర్మాటిక్స్ యూజర్స్ మీట్‌కు శుక్రవారం ఎంపికయ్యాడు. ప్రస్తుతం అజేందర్‌కుమార్ కాలిఫోర్నియా యూనివర్సిటీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ జియో ఇన్ఫర్మాటిక్స్ విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. ఆయన ఇటీవల తెయూ నుంచి ఐదుగురు విద్యార్థులను ఆన్‌లైన్ ప్రాజెక్టు వర్కుకు ఎంపికచేశాడని సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ కవితతోరస్ అన్నారు. ప్రపంచ సదస్సుకు అజేందర్‌కుమార్ ఎంపికవడం సౌత్‌క్యాంపస్‌కు గర్వకారణమన్నారు. ఆయనను ఫోన్‌లో అభినందించారు.

## అవినీతి ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

**భీమ్‌గల్:** దళిత బంధు పథకంలో అవినీతికి పాల్పడిన మంత్రులు, ఎమ్మెల్యేలపై సీఎం కేసీఆర్ చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన భీమ్‌గల్‌లో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జరిగిన బీఆర్‌ఎస్ సమావేశంలో సీఎం కేసీఆరు దళితబంధులో మంత్రులు, ఎమ్మెల్యేలు లబ్ధిదారుల నుంచి డబ్బు తీసుకున్నట్లు చెప్పారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతి కేసీఆర్ మాటల ద్వారా బయట పడిందన్నారు. కేసీఆర్ ప్రవేశ పెట్టిన ప్రతి పథకం అవినీతిమయమేనని విమర్శించారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల విషయంలో కూడా టీఆర్‌ఎస్ కార్యకర్తలు కమీషన్ తీసుకుంటున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొదిరె స్వామి, జేజే నర్సయ్య, రమేష్, నాగేంద్ర, వాక మహేష్ పాల్గొన్నారు.

### హిందీలో గోదావరికి డాక్టరేట్



**తెయూ(డిచ్‌పల్లి):** తెలంగాణ యూనివర్సిటీ హిందీ విభాగం పరిశోధకురాలు టక్కర్వాడ్ గోదావరి డాక్టరేట్ సాధించారు. తెయూ హిందీ అసోసియేట్ ప్రొఫెసర్ జి.ప్రవీణబాయి పర్యవేక్షణలో 'నసీరా శర్మ కే ఉపన్యాసో మే నారికి దశ– దిశ' అనే అంశంపై గోదావరి పరిశోధన గ్రంథం సమర్పించారు. శుక్రవారం జరిగిన వైవాకు మహారాష్ట్ర ధర్మాబాద్‌లోని లాల్ బహదూర్ శాస్త్రి మహా విశ్వవిద్యాలయ్ ప్రొఫెసర్ ప్రతిభ ఎరేకర్ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో హిందీ హెచ్‌వోడీ జమీల్, బీవోఎస్ చైర్మన్ పార్వతి, డీన్ కనకయ్య పాల్గొన్నారు.

## క్రైం కార్నర్

### కుక్కల దాడిలో గొర్రెపిల్లల మృతి

**మాక్లూర్:** మండలంలోని వల్లభాపూర్‌లో శుక్రవారం కుర్మేడెబ్బ చిన్న చిన్నయ్యకు చెందిన ఐదు గొర్రెపిల్లలపై కుక్కలు దాడి చేయడంతో మృతిచెందాయి. తన ఇంటి వెనుకాలే ఉన్న గొర్రెల మందపై కుక్కలు దాడి చేసినట్లు బాధితుడు తెలిపారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సర్పంచ్ మంజులసుధాకర్ తెలిపారు.

### పేకాట స్థావరంపై దాడి

**బిచ్కుంద:** మండలంలోని గుండెకల్లూర్‌లో పేకాడుతున్న ఆరుగురిని శుక్రవారం పట్టుకున్నామని ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు. పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు దాడి చేసి వారి నుంచి రూ.5,290 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.



### చెరువులో పడి ఒకరి మృతి



గంగరాజు (ఫైల్)

**భిక్కనూరు:** మండలంలోని రామేశ్వర్‌పల్లిలో చెరువులో పడి ఒకరు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పైతరి గంగరాజు(40) వ్యవసాయం చేస్తు జీవిస్తున్నాడు. శుక్రవారం వేకువజామున బహిర్భూమి కోసం చెరువు కట్టపై వెళ్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడ్డాడు. గంగరాజుకు ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. దీన్ని గమనించిన వారు వెంటనే గజ ఈతగాళ్లతో గాలించగా గంగరాజు మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ఆనంద్‌గౌడ్ వివరించారు.

### చెట్టుపై నుంచి పడి ఒకరు..

**లింగంపేట:** లింగంపేటకు చెందిన హైమద్‌హుస్సేన్(35) మామిడి చెట్టుపై నుంచి పడి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. బుధవారం హైమద్‌ హుస్సేన్ గ్రామ శివారులో గల మామిడి చెట్టుపైకి ఎక్కి కాయలు తెంపుతుండగా పడిపోయాడు. తీవ్ర గాయాలైన బాధితుడిని కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య హసీనా, కుమారుడు ఆజిబాబా ఉన్నారు.

### కరెంట్ షాక్‌తో బాలిక..



**నవీపేట:** మండలంలోని నాగేపూర్ గ్రామంలో శుక్రవారం రాత్రి కరెంట్ షాక్‌తో కావేరి(11) అనే బాలిక మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన సుమన్ కొత్తగా ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. ఇంటి పనులను చూసేందుకు వచ్చిన కావేరి వేలాడుతున్న విద్యుత్ తీగలను తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. చిన్నారి మోపాల్‌లోని గురుకుల పాఠశాలలో ఆరో తరగతి చదువుతుంది. వేసవి సెలవులు కావడంతో ఇంటికి వచ్చి కొత్త ఇంట్లో ప్రమాదానికి గురై చనిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు.

### చికిత్స పొందుతూ ఒకరు..

**నవీపేట:** మండలంలోని ఆశాజ్యోతి కాలనీకి చెందిన కొక్కెర శ్రీనివాస్ (45) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై రాజారెడ్డి తెలిపారు. శ్రీనివాస్ అప్పుల బాధతో ఈ నెల 25న నవీపేట శివారులో పురుగుల మందు తాగి అస్వస్థతకు గురయ్యాడని పేర్కొన్నారు. సమాచారం తెలుసుకున్న కుటుంబీకులు జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారని తెలిపారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని, మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

### కుక్కను తప్పించబోయి..

**నవీపేట:** మండలంలోని నాగేపూర్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై రాజారెడ్డి తెలిపారు. నిర్మల్ జిల్లా బాసరకు చెందిన బోధన్‌కర్ పెద్ద గంగాధర్(37) హార్వెస్టర్ నాగేపూర్ శివారులో వరి కోతలు కోయడానికి వచ్చింది. హార్వెస్టర్‌పై డ్రైవర్, క్లీనర్లకు బాసర నుంచి గంగాధర్ ఆహారం తీసుకువస్తుండగా నాగేపూర్ శివారులో కుక్క అడ్డు వచ్చింది. కుక్కను తప్పించబోగా బైక్ అదుపు తప్పి పడిపోయాడు. తీవ్రంగా గాయపడ్డ గంగాధర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## రైతును బలిగొన్న అధికారుల నిర్లక్ష్యం

- ఈదురుగాలులకు తెగిపోయిన విద్యుత్ తీగలు
- సరఫరా నిలిపివేయని సిబ్బంది
- ఆ వైర్లు తాకి షాక్‌తో రైతు మృతి





నారాయణ మృతదేహం, నారాయణ(ఫైల్)

**సిరికొండ:** అధికారుల నిర్లక్ష్యానికి ఓ రైతు ప్రాణం బలైంది. ఈదురుగాలులకు చెట్టు పడి విద్యుత్ తీగలు తెగిపోతే.. సరఫరా నిలిపివేయమని గ్రామస్తులు చెప్పినా విద్యుత్ సిబ్బంది పట్టించుకోలేదు. దీంతో ఆ తీగలను చూసుకోకుండా తాకిన ఓ రైతు మృతి చెందాడు. మండలంలోని న్యావనంది శివారులో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన ఎస్సై నర్సింలు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. న్యావనంది గ్రామానికి చెందిన నారాయణ(60) శుక్రవారం పొలానికి వెళ్లాడు. ఈ నెల 26న వీచిన ఈదురుగాలులకు నారాయణ పొలం సమీపంలో తాటి చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడటంతో తీగలు తెగిపోయాయి. అటువైపు విద్యుత్ ప్రసారం నిలిపివేయాలని రైతులు విద్యుత్ శాఖ వారికి సూచించినట్లు గ్రామస్తులు తెలిపారు. వారు విద్యుత్ ప్రచారం నిలిపి వేయకపోవడంతో పొలం వద్దకు వెళ్లిన నారాయణ ఆ తీగలకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. భోజనం సమయం దాటిపోతున్న నారాయణ ఇంకా ఇంటికి రావడం లేదని అతని కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా నారాయణ మృతి చెంది ఉన్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నర్సింలు తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై సిరికొండ ఏఈ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా పలు గ్రామాల్లో తెగిపోయిన తీగలను సరి చేశామన్నారు. చాలా చోట్ల తీగలు తెగిపోవడంతో ఆ గ్రామంలో తెగిపోయిన తీగలను తనిఖీల్లో గుర్తించలేకపోయామని చెప్పారు. ఇంకా మరమ్మతులు చేస్తునే ఉన్నామన్నారు.

### రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి



**కమ్మర్‌పల్లి:** ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతులు ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని కోనాసముందర్, కోనాపూర్ సొసైటీల పరిధిలోని కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. కల్లాలో, కొనుగోలు కేంద్రంలో ఉంచిన ధాన్యంపై కవర్లు కప్పుకొని గాలికి కొట్టుకుపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ధాన్యం ఆరిన తర్వాతే కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ధాన్యం తప్ప, తాలు, తరుగు విషయంలో రైస్ మిల్లర్లు ఇబ్బంది పెడుతున్నారని కోనాసముందర్ సొసైటీ చైర్మన్ సామ బాపురెడ్డి ఆయన దృష్టికి తీసుకు రాగా, మిల్లర్లతో మాట్లాడుతానని చెప్పారు. కోనాపూర్ సొసైటీ చైర్మన్ బడాల రాజేందర్, తహసీల్దార్ సురేష్‌కుమార్ ఉన్నారు.

### సిలిండర్ల చోరీ కేసులో ఒకరి అరెస్టు



**ఖలీల్‌వాడి:** ఆటోలో నుంచి సిలిండర్లు చోరీ చేసిన నిందితుడిని అరెస్టు చేసినట్లు ఏసీపీ కిరణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. మోపాల్ మండలం తానాకుర్దు గ్రామానికి చెందిన అచ్చ సురేందర్‌రెడ్డి నగరంలోని ఆహ్మదీపురా కాలనీలో ఇండేన్ గ్యాస్‌కు సంబంధించిన 10 సిలిండర్లను ఈ నెల 25న చోరీ చేశాడు. ఈ మేరకు ఆటో ఇండేన్ గ్యాస్ సిబ్బంది మహ్మద్ తెల్‌మిజ్‌ఖాన్ ఫిర్యాదు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజీని పరిశీలించిన తర్వాత నిందితుడు సురేందర్‌రెడ్డిని శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనను విచారించగా గతంలో సైతం సిలిండర్లు చోరీ చేసినట్లు ఒప్పుకున్నట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడి నుంచి 25 సిలిండర్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సమావేశంలో సీఐ వెంకటనారాయణ, ఎస్సై ఉదయ్‌కుమార్ ఉన్నారు.

## గంజాయి విక్రయించే ముఠా అరెస్టు



నిందితులను చూపుతున్న పోలీసులు

**మోర్తాడ్:** మోర్తాడ్‌లో గంజాయి విక్రయించే ముఠా సభ్యులు నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆర్మూర్ ఏసీపీ ప్రభాకర్ రావు వెల్లడించారు. నిందితుల నుంచి 500 గ్రాముల గంజాయి, మూడు ద్విచక్ర వాహనాలను, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ వివరించారు. మోర్తాడ్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిందితులు ఆదిలాబాద్ జిల్లా నుంచి గంజాయిని తీసుకొచ్చి ఆరు నెలలుగా విక్రయిస్తున్నట్లు తెలిపారు. పక్కా సమాచారంతో మోర్తాడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని యానాంలో ఒక ఇంటిలో గంజాయి సేవిస్తూ విక్రయించడానికి సిద్ధంగా ఉన్న నలుగురిని ఎస్సై ముత్యం రాజు అతని బృందం అరెస్టు చేసిందని ఏసీపీ తెలిపారు. మోర్తాడ్‌కు చెందిన గాడుదల రాకేష్, ఆర్మూర్‌కు చెందిన దూది రవితేజ, వడ్యాట్‌కు చెందిన మహమ్మద్ అర్షద్, ఆర్మూర్ పట్టణానికి చెందిన మరో నిందితుడు తోపారం శశి శేఖర్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. గంజాయి ముఠా అరెస్టులో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై, సిబ్బంది బాలాజీ, నారాయణ, సాయికుమార్, అక్బర్, నర్సయ్యను ఏసీపీ అభినందించారు.

## డిపాజిట్ల పేరిట రూ.12 లక్షలకు టోకరా

**కామారెడ్డి క్రైం:** యాప్‌లో డిపాజిట్ చేస్తే అధిక మొత్తం చెల్లిస్తామని నమ్మించి ఓ వ్యక్తికి రూ.12 లక్షలు టోకరా వేశారు. కామారెడ్డిలోని ఓం శాంతి ప్రాంతంలో నివాసం ఉండే సోమన్నగారి సందీప్‌కుమార్ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. డిఫాబెట్ యాప్‌లో పెట్టుబడి పెడితే అధిక మొత్తంలో లాభాలు వస్తాయని సోషల్ మీడియాలో చూశాడు. దీంతో లోన్‌యాప్‌ల్లో రుణం తీసుకొని డిఫాబెట్ యాప్‌లో పెట్టుబడి పెట్టాడు. అలా విడతల వారీగా రూ.12 లక్షలు పెట్టాడు. చివరికి మోసపోయినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో నరేష్ శుక్రవారం తెలిపారు.